క్లుప్తంగా

మోడల్ స్కూళ్లలో సమస్యలు పరిష్కరించాలని వినతి



వినతిపత్రం ఇస్తున్న హర్షవర్ధన్ రెడ్డి, సత్యనారాయణ

కోరుట్ల: రాష్ట్రంలోని మోడల్ స్కూళ్లలో సమస్యలపై రాష్ట్ర విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్ర వెంకటేశం, విద్యాశాఖ కమిషనర్ దేవసేనను పీఆర్టీయూ తెలంగాణ గౌరవ అధ్యక్షుడు హర్షవర్ధన్, ప్రధాన కార్యదర్శి పార్వతి సత్యనారాయణ బుధవారం కలిసి వినతిపత్రం ఇచ్చినట్లు పీఆర్టీయూ ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా 010, బదిలీలు, హిందీ పీజీటీ, జేఎల్ అప్‌గ్రేడ్, హెచ్‌బీటీ తదితర అంశాలను వారి దృష్టికి తీసుక వెళ్లగా ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత సీఎం మాట్లాడి పరిష్కారానికి ప్రయత్నిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు.

ఓబులపూర్ తండాను సందర్శించిన డీపీవో



అధికారులతో మాట్లాడుతున్న డీపీవో

మల్లాపూర్: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు ఓబులాపూర్ తండా గ్రామాన్ని మండల ప్రత్యేక అధికారి డీపీవో దేవరాజ్ బుధవారం సందర్శించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వేసవిలో నెలకొనే పరిస్థితులపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజేందర్ రెడ్డి, ఎంపీవో జగదీష్, ఏపీవో సతీష్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వేసవిలో పిల్లలు జాగ్రత్తగా ఉండాలి



మాట్లాడుతున్న చైర్‌పర్సన్

జగిత్యాల: వేసవి సెలవుల్లో ఇంటి వద్ద పిల్లలు జాగ్రత్తగా ఉండాలని మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణానికి చెందిన ఏడుగురు పిల్లలు మోతె చెరువులో ఈతకు వెళ్లి బాలుడు మరణించడం బాధాకరమన్నారు. అలాగే బైపాస్‌రోడ్‌లో బైక్‌పైవెళ్తూ మరో వాహనం ఢీకొనడంతో అబ్బాయి మరణించాడన్నారు. ఇలా అనేక సంఘటనలు జరుగుతున్నాయని, తల్లిదండ్రులు పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. ముఖ్యంగా కంప్యూటర్ క్లాసెస్, కోచింగ్, విద్యపై దృష్టి పెట్టేలా చూడాలన్నారు.

తాగునీటి సమస్యపై అప్రమత్తంగా ఉండాలి



కేంద్రంలో పరిశీలిస్తున్న వెంకటేశ్వర్‌రావు

కథలాపూర్: వేసవిలో గ్రామాల్లో తాగునీటి సమస్యలపై అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేకాధికారి వెంకటేశ్వర్‌రావు అన్నారు. బుధవారం కథలాపూర్ మండల పరిషత్ కార్యాలయంలో అన్ని గ్రామాల ప్రత్యేకాధికారులతో సమావేశం నిర్వహించారు. మిషన్ భగీరథ గ్రిడ్ నుంచి నీళ్లు రాకపోతే గ్రామాల్లోని బోరుబావుల ద్వారా ట్యాంక్‌లను నింపి యథావిధిగా నీటి సరఫరా చేయాలన్నారు. అనంతరం భూషణరావుపేట, ఊట్‌పెల్లి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను, వననర్సరీ, ఆరోగ్య ఉపకేంద్రాలను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీవో శంకర్, ఎంపీవో ప్రవీణ్ ఉన్నారు.

తాగునీటి సరఫరా పరిశీలన

ఇబ్రహీంపట్నం: మండలంలోని వర్షకొండ, ఎర్దండి గ్రామాల్లో గ్రామ ప్రత్యేకాధికారి ,తహసీల్దార్ బుధవారం పర్యటించారు. తాగునీటి సమస్యపై ఆరాతీశారు. గ్రామాల్లో రక్షిత మంచి నీటి ట్యాంకులకు భగీరథ నీళ్లు వస్తున్నాయా, రాని పక్షంలో బోర్లు, బావుల నుంచి నీటిని సరాఫరా చేసేందుకు వసతులు ఉన్నాయా పరిశీలించారు. పాఠశాలల్లో, ప్రధాన కూడళ్లలో ఉన్న హ్యాండ్ బోర్ల నుంచి నీళ్లు వస్తున్నాయా లేదా అని పరిశీలించారు. తాగునీటి సమస్య లేకుండా చూడాలని కార్యదర్శులను కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు మనోజ్, రాకేశ్, కారోబార్ రత్నం పాల్గొన్నారు.

కొన'సాగుతున్న' జీపీ భవనాల నిర్మాణం

- మెట్‌పల్లి మండలంలో 11 జీపీ భవనాలకు నిధులు
- కొన్ని చోట్ల ప్రారంభం కాని పనులు
- పనుల్లో జాప్యం
- అసౌకర్యాలతో ఇబ్బందులు



కొండ్రికర్ల పాత ప్రైమరీ పాఠశాలలో నిర్వహిస్తున్న గ్రామ పంచాయతీ

మెట్‌పల్లిరూరల్: గ్రామాల్లో మెరుగైన పాలన అందించేందుకు గత ప్రభుత్వం నూతన గ్రామ పంచాయతీ భవనాలు నిర్మించేందుకు సంకల్పించింది. దీనిలో భాగంగా భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. కానీ భవన నిర్మాణాలకు స్థల సమస్య,కొన్ని చోట్ల పనులు చేపట్టేందుకు ఎవ్వరూ ముందుకు రాకపోవడంతో పాటు ఇతర కారణాలతో భవన నిర్మాణాలకు పట్టిన గ్రహణం వీడడం లేదు. కొన్ని చోట్ల నిర్మాణాలు జరుగుతున్న, మరికొన్ని చోట్ల మొత్తానికే పనులు ప్రారంభం కాలేదు.

ఒక్కో పంచాయతీకి రూ.20 లక్షలు

మెట్‌పల్లి మండలంలో 11 నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణాలకు నిధులు మంజూరయ్యాయి. ఒక్కో భవన నిర్మాణానికి ఉపాధిహామీ నిధుల నుండి రూ.20 లక్షల చొప్పున నిధులను కేటాయించారు. ఇందులో సత్తక్కపల్లి, విట్టంపేట, రామారావుపల్లె, కేసీఆర్‌తండా, ఆత్మనగర్, ఆత్మకూర్ గ్రామాల్లో భవన నిర్మాణాలు పూర్తయినట్లు అధికారులు చెబుతున్నారు. పెద్దాపూర్,రామలచ్చక్కపేటలో నిర్మాణాలు స్లాబ్ దశలో ఉండగా, కొండ్రికర్ల, కోనరావుపేట, చెర్లకొండాపూర్‌లో నిర్మాణాలు మొత్తానికే ప్రారంభం కాలేదు. కొండ్రికర్ల, కోనరావుపేటలో పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రాక, చెర్లకొండాపూర్‌లో స్థల వివాదంతో పనులు ప్రారంభం కాలేదని తెలిసింది.

మంజూరైన పంచాయతీలు	11
పూర్తయినవి	06
స్లాబ్ దశలో ఉన్నవి	02
ప్రారంభకానివి	03

అసౌకర్యాలతో అవస్థలు..

గ్రామ పంచాయతీలకు పక్కా భవనాలు లేకపోవడంతో అసౌకర్యాల మధ్య ఇతర భవనాల్లో పంచాయతీలను కొనసాగిస్తున్నారు. పాఠశాల గదులు,పాత భవనాలు, సంఘాల భవనాల్లో తాత్కాలికంగా పంచాయతీలను ఏర్పాటు చేసి పాలన కొనసాగిస్తున్నారు. వాటిలో కనీస వసతులు,సరైన సౌకర్యాలు సైతం లేవు. దీంతో పనులకోసం పంచాయతీలకు వచ్చే ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి భవనాలు పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

పనులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు



గ్రామ పంచాయతీ భవన నిర్మాణాలు త్వరగా పూర్తయ్యేలా చర్యలు చేపడుతున్నాం.ఇప్పటికే కొన్ని పూర్తయ్యాయి.మిగతావి కూడా త్వరగా పూర్తయ్యేలా కృషి చేస్తాం.ఎప్పటికప్పుడు పనులను పర్యవేక్షిస్తున్నాం.

– అన్వర్,డీఈ పంచాయితీరాజ్, మెట్‌పల్లి

ముత్యాల పోచమ్మ ఆలయంలో విగ్రహ పతిష్ఠాపనోత్సవాలు



హోమంలో పాల్గొన్న పండితులు, ఆలయ కమిటీ సభ్యులు

మల్యాల: మల్యాల మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన ముత్యాల పోచమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. బుధవారం ఉదయం ఆలయంలో చండీ హోమం నిర్వహించారు. భక్తులు రుద్ర హోమం, మహాభిషేకం నిర్వహించారు. మహిళలు సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ఎల్లాల జనార్ధన్‌రెడ్డి,పండితులు,నాయకులుపాల్గొన్నారు.

కనుల పండువగా పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ

రాయికల్: మండలం కొత్తపేటలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. ఆలయంలో ఉత్సమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు మందుల నాగరాజు, బక్కన్న పాల్గొన్నారు.

శ్రీ రామలింగేశ్వర స్వామికి ప్రభుత్వ విప్ పూజలు

మేడిపల్లి : మండలంలోని మాచాపూర్‌లో శ్రీరామలింగేశ్వర స్వామి వారి విగ్రహ పున ప్రతిష్ఠాపన మహోత్సవంలో ప్రభుత్వ విప్,వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రమేష్ రెడ్డి, బద్దం రాజేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో సాంబశివస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన

ఇబ్రహీంపట్నం: మండలంలోని అమ్మక్కపేటలో గ్రామానికి చెందిన న్యాయవాది బద్దం గంగాధర్ గ్రామ శివారులో సాంబశివస్వామి ఆలయాన్ని నిర్మించారు. బుధవారం ఆలయంలో సాంబశివ స్వామి విగ్రహ ప్రతిష్ఠను హంపి పీఠాధిపతి విద్యారణ్య భారతీ స్వామి ఆధ్వర్యంలో ప్రతిష్ఠించారు. కార్యక్రమానికి కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. న్యాయవాది గంగాధర్, భూదేవి, గ్రామస్తులు పాల్గొన్నారు.

యాపల్ చెరువు వద్ద వంతెన నిర్మాణం పూర్తి చేయాలి

పెగడపల్లి: మండల కేంద్రంలోని యాపల్ చెరువు వాగు వద్ద నిలిచిన వంతెన పనులు వెంటనే పూర్తి చేయాలని రైతులు కోరుతున్నారు. ఈ వంతెన మిగులు పనికి నిధులు కేటాయించాలని ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్‌ను రైతులు వేడుకుంటున్నారు. వంతెన నిర్మాణానికి గత ప్రభుత్వం రూ. 1.20 కోట్లు కేటాయించగా, దాదాపు 75 శాతం పనులు పూర్తయ్యాయని, మిగతా పనులు నిలిపివేశారు. దీంతో వాగు అవతలి వైపున ఉన్న పంట పొలాలకు, ఇవతలి వైపున ఉన్న పంట పొలాలకు వెళ్లే రైతులు అవస్థలు పడుతున్నారు. పనులు నిలిచిపోయి నాలుగేళ్లు దాటినా.. పనులు పునఃప్రారంభానికి అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు చేపట్టక పోవడంతో రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. వంతెన మిగులు పనులతో పాటు రెండు వైపులా రాకపోకలకు దారి ఏర్పాటు చేయాల్సి ఉంది. వంతెన నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ను రైతులు కోరుతున్నారు.



అసంపూర్తిగా వంతెన నిర్మాణ పనులు

సైబర్ నేరాలపై యువత అప్రమత్తంగా ఉండాలి

జగిత్యాలక్రైం: సైబర్ నేరాలపై యువత అప్రమత్తంగా ఉండాలని జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ అన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో సైబర్ జాగృత దివస్ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లు ఎన్నో రకాల మాయ మాటలు చెప్పి నేరాలకు పాల్పడుతున్నారని, ఎవరు ఆగంతకులు ఫోన్ చేసినా వ్యక్తిగత వివరాలు వెల్లడించొద్దన్నారు. హోటల్ బుకింగ్‌స్కామ్, పెట్టుబడి మోసం, మాయమాటలతో సైబర్ నేరాలకు పాల్పడుతున్నారన్నారు. సైబర్ నేరగాళ్లు పంపే లింక్‌లు ఓపెన్ చేయవద్దని, బ్యాంక్ వ్యక్తిగత వివరాలు, ఏటీఎం వివరాలు, ఓటీపీలు ఎవరికి చెప్పొదన్నారు. కార్యక్రమంలో పట్టణ సీఐ వేణుగోపాల్, ఎస్సైలు మన్మధరావు, నరేశ్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన ఉండాలి

మెట్‌పల్లి: సమాజంలో జరుగుతున్న సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన ఉండాలని సైబర్ క్రైమ్ విభాగం డీఎస్పీ రంగారెడ్డి అన్నారు. పట్టణంలోని జ్ఞానోదయ డిగ్రీ కళాశాలలో బుధవారం సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఫోన్‌కు అనుమానాస్పద మెసేజ్‌లు, కాల్స్ వస్తే పోలీసులకు సమాచారమందించాలన్నారు. రోజురోజుకు సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయని, అలాంటి వాటి పట్ల అవగాహన కలిగి ఉంటే ఇబ్బందులు పడే అవకాశముండదన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ ఉమమహేశ్వర్‌రావు, సీఐ నవీన్, ఎస్సై చిరంజీవి, కరస్పాండెంట్ ఇల్లెందుల శ్రీనివాస్ ఉన్నారు.



మాట్లాడుతున్న డీఎస్పీ రఘుచందర్

ఎండవేడిమితో జాగ్రత్తగా ఉండాలి

సారంగాపూర్: రోజురోజుకు ఎండ తీవ్రత పెరుగుతుందని, ప్రజలు ఎండవేడిమిపై అప్రమత్తంగా ఉండాలని ఎంపీవో శశికుమార్‌రెడ్డి అన్నారు. పీహెచ్‌సీ ఆధ్వర్యంలో బుధవారం సారంగాపూర్‌లో ఇంటింటా ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వడదెబ్బకు తీసుకోవలిసిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సులోచన, పంచాయతీ కార్యదర్శి ప్రేమలత, ఏఎన్‌ఎం విజయలక్ష్మీ, ఆశా కార్యకర్తలు మంజుల , జ్యోతి తదితరులు ఉన్నారు.

వడదెబ్బతో తస్మాత్ జాగ్రత్త

వెల్గటూర్ : వేసవికాలంలో వడదెబ్బతో జాగ్రత్తగా ఉండాలని ఏఎన్‌ఎం జయప్రద అన్నారు. మండల కేంద్రంలోని అంగన్‌వాడీ 2 కేంద్రంలో పిల్లలకు అన్నప్రాసన వేడుకలు నిర్వహించారు. అలాగే వైద్యారోగ్యశాఖ సిబ్బంది ఆధ్వర్యంలో వేసవికాలంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అనంతరం ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ మల్లీశ్వరి, కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.



వేసవికాలంలో జాగ్రత్తలను వివరిస్తున్న ఏఎన్‌ఎం

కోరుట్ల ఎమ్మెల్యేకు సన్మానం



ఎమ్మెల్యే సంజయ్‌ను సన్మానిస్తున్న నాయకులు

కథలాపూర్: కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్‌ను కథలాపూర్‌లో మండల బీఆర్‌ఎస్ నాయకులు బుధవారం సన్మానించారు. ఎమ్మెల్యేగా గెలుపొందాక తొలిసారిగా కథలాపూర్‌కు వచ్చినందుకు శాలువాలతో సన్మానించారు. అనంతరం ఆటో డ్రైవర్లతో ఎమ్మెల్యే సంజయ్ మాట్లాడి ఉపాధి ఏలా ఉందని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు నాగేశ్వర్‌రావు, సబ్బని గంగు, ఎం.డీ రఫీక్, సోమ దేవేందర్‌రెడ్డి, ఆమెట రాజు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి ఎమ్మెల్యే అభినందన

ఇబ్రహీంపట్నం: మండలంలోని వేములకుర్తిలో న్యూ విజన్ పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న కుమ్మరిపల్లి కార్తీక్ నవోదయ లో 6వ తరగతి సీటు సాధించాడు. బుధవారం మెట్‌పల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విద్యార్థి కార్తీక్‌ను ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ సన్మానించి, పుస్తకాలు అందచేశారు. కార్యక్రమంలో పాఠశాల కరాస్పాండెంట్ గుమ్మల తిరుపతి, నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పిల్లలు ప్రీస్కూల్‌కు హాజరయ్యేలా చూడాలి



అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ సూపర్‌వైజర్

జగిత్యాల: మూడేళ్లు నిండిన పిల్లలందరినీ తప్పనిసరిగా అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించే ప్రీస్కూల్‌కు హాజరయ్యేలా చూడాలని సూపర్‌వైజర్ లావణ్య అన్నారు. టీఆర్‌నగర్‌లో ఈసీసీఈ ఆన్వల్ డే సెలబ్రేషన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో అన్ని వసతులున్నాయని, పిల్లల శారీరక, మేథోవికాసం, భాష నేర్చుకునే రీతులు వంటి అంశాలపై అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో టీచర్లు వనిత, రజిత పాల్గొన్నారు.

చలివేంద్రాలు ప్రారంభం

కోరుట్ల: పట్టణంలో మున్సిపల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ బట్టు తిరుపతి అన్నారు. మున్సిపల్ కార్యాలయం, పాత మున్సిపల్ ఆఫీస్, కొత్త బస్టాండ్, నంది చౌరస్తా వద్ద చలివేంద్రాలు ప్రారంభించారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకొని కలెక్టర్ ఆదేశాలతో చలివేంద్రాలు ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ డిపో మేనేజర్ విజయ మాధురి, మున్సిపల్ మేనేజర్ రాజేశ్, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

నేషనల్ లెవల్‌లో విద్యార్థుల ప్రతిభ

రాయికల్: నేషనల్ లెవల్‌లో నిర్వహించే ఎక్స్‌ప్లోరా ఒలంపియాడ్ టాలెంట్ టెస్ట్‌లో పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులు వైశిక, కలీస అబ్బా, శ్రీకృతి, రుద్వేద్, అగస్త్య, అర్పిన్, ప్రణయశ్రీ జాతీయ స్థాయిలో ప్రతిభ కనబర్చి బహుమతులు సాధించినట్లు ప్రిన్సిపాల్ వేణుగోపాల్‌రావు తెలిపారు. హరిహర భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో రిటైర్డ్ ఐఏఎస్ చిరంజీవి, రిటైర్డ్ ప్రొఫెసర్ కోదండరాం చేతులమీదుగా బహుమతులు అందుకున్నారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను పలువురు అభినందించారు.

మండల అంబేడ్కర్ సంఘం నూతన కార్యవర్గం

పెగడపల్లి:మండల అంబేడ్కర్ సంఘం అధ్యక్షునిగా బాలె అంజయ్య ఎన్నికయ్యారు. సంఘం ఎన్నికలు బుధవారం మండల కేంద్రంలో జిల్లా అధ్యక్షుడు ఆరెల్లి లక్ష్మీరాజం అధ్యక్షతన జరిగాయి. ప్రధాన కార్యదర్శిగా బత్తుల ప్రదీప్, ఉపాధ్యక్షులుగా సుంకె అంజయ్య, భూంపల్లి ఏసురత్నం, సుంకె ప్రకాశ్, కార్యదర్శిగా ఆరెల్లి నారాయణ, సహాయ కార్యదర్శిగా తడగొండ తిరుపతి, అధికార ప్రతినిధిగా శ్రీరాం అంజయ్య ఎన్నికయ్యారు. కార్యక్రమంలో మండల సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

ఇబ్రహీంపట్నం: మండల కేంద్రంలోని శివారులో బుధవారం అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై అనిల్ తెలిపారు. మల్లాపూర్ మండలం వాల్గొండకు చెందిన ఇస్లావత్ రాకేశ్, బొదాసు భూమేశ్ వాల్గొండ నుంచి ఇబ్రహీంపట్నంకు ఇసుకను అక్రమంగా రవాణా చేస్తుండగా వారిపై కేసు నమోదు చేసి ఇసుక ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి

ధర్మపురి: మండలంలోని నేరెళ్ల, గోవిందుపల్లె గ్రామాల్లో విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని కాంగ్రెస్ మండల అధికార ప్రతినిధి జాజాల రమేశ్ కోరాడు. గ్రామాల్లో విద్యుత్ సమస్యపై బుధవారం గ్రామస్తులతో కలిసి నేరెళ్ల సబ్‌స్టేషన్‌కు వెళ్లారు. సంబంధిత ఏఈని కలిసి గ్రామాల్లో విద్యుత్ సమస్య నెలకొందని, ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మెరుగు పరుశురాం, మల్లేశం, మహేశ్, శ్రీకాంత్, అజయ్, రమేశ్ పాల్గొన్నారు.

ప్రశ్నించే గొంతుకు పట్టం కట్టాలి

ఇబ్రహీంపట్నం: ప్రశ్నించే గొంతు, నిజామాబాద్ కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థి జీవన్ రెడ్డిని గెలిపించాలని టీపీసీసీ ఎన్‌ఆర్‌ఐ సెల్ కన్వీనర్ షేక్ చాంద్ పాషా కోరారు. మండలంలోని ఎర్దండి, వర్షకొండ గ్రామాల్లో బుధవారం ఎన్‌ఆర్‌ఐ డిక్లరేషన్ పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. గల్ఫ్‌లో మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు రూ. 5 లక్షల ఆర్థిక సాయం అందించేందుకు జీవన్‌రెడ్డి కాంగ్రెస్ మేనిఫెస్టోలో చేర్పించాలన్నారు. ప్రవాసి భారతీయ భీమా పథకం పరిహారం రూ. 10 లక్షల నుంచి రూ. 25 లక్షలు పెంచుతామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని తెలిపారు. హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చుతుందన్నారు. జీవన్‌రెడ్డిని నిజామాబాద్ ఎంపీగా గెలిపించాలని కోరారు.

సంక్షిప్త వార్తలు

పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య

జగిత్యాల: పోరాట యోధుడు దొడ్డికొమురయ్య అని కుర్మ సంఘం నాయకులు అన్నారు. బుధవారం విజయపురిలోని దొడ్డికొమురయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో దయాల మల్లారెడ్డి, పోచాలు, అయిలయ్య, నారాయణ, రాజేందర్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కుర్మసంఘం ఆధ్వర్యంలో..

మెట్‌పల్లి: తెలంగాణ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య జయంతి సందర్భంగా కురుమ సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని ఆయన విగ్రహానికి బుధవారం ఘనంగా నివాళి అర్పించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు కోట రమేష్, తుల రాజేందర్, కోట మహేశ్, సాయన్న, రవి, అంజన్న తదితరులున్నారు.

నిరుపేద వివాహానికి ఆర్థిక సాయం

బుగ్గారం: మండలంలోని సిరికొండ గ్రామానికి చెందిన ఓ నిరుపేద కుటుంబానికి చెందిన యువతి వివాహానికి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వేముల సుభాష్ చేయూత అందించారు.గ్రామానికి చెందిన గుడివేందుల లక్ష్మణ్-పుష్పల కూతురు అశ్విని వివాహం సందర్భంగా వారి ఆర్థిక పరిస్థితి తెలుసుకున్న ఆయన తన వంతు సాయంగా రూ.10 వేల నగదును అందించారు. కార్యక్రమంలో నాయకులు నగునూరి నర్సాగౌడ్,కుంట మహేష్,గజ్జెల విజయ్,తదితరులు ఉన్నారు.

గాలికుంటు వ్యాధి టీకాలు వేయించుకోవాలి

జగిత్యాల: గాలికుంటు వ్యాధి టీకాలు వేయించుకోవాలని పశుసంవర్ధక శాఖ అధికారి వేణుగోపాల్ అన్నారు. బుధవారం లక్ష్మీపూర్ గ్రామంలో ఉచిత గాలికుంటు నివారణ టీకాలు వేశారు. కార్యక్రమంలో సహాయ సంచాలకులు బోనగిరి నరేశ్, వెటర్నరీ లైవ్‌స్టాక్‌ఆఫీసర్ పూర్ణచందర్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలకు రైతుల గురించి మాట్లాడే నైతిక హక్కు లేదు

మల్యాల: కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ రైతుల కోసం చేపట్టిన దీక్షపై మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ చేసిన విమర్శలను తీవ్రంగా ఖండిస్తున్నామని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మద్రిపల్లి సత్యం, మండల ప్రధాన కార్యదర్శి గాజుల మల్లేశం అన్నారు. బుధవారం మల్యాలలో మాట్లాడారు. 60 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో పంటల ఇచ్చిన మద్దతు ధరలను బీజేపీ పాలనలో రెట్టింపు చేసిందన్నారు. కాంగ్రెస్ పార్టీకి రైతులపై ప్రేమ ఉంటే ఈ సీజన్‌లో మద్దతు ధరకు రూ.500 బోనస్ అమలు చేయాలని డిమాండ్ చేశారు.

నాసిరకం రేషన్ బియ్యం సరఫరా

రాయికల్: పట్టణంలోని 5వ నంబర్ రేషన్ షాపులో తుట్టెలు పట్టిన బియ్యం సరఫరా కావడంతో రేషన్ లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సివిల్ సప్లై అధికారులు స్పందించి నాణ్యమైన బియ్యం సరఫరా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

హనుమాన్ దీక్షలు ప్రారంభం

మల్లాపూర్: వాల్గొండలో బుధవారం హనుమాన్ దీక్షా పీఠం వ్యవస్థాపకుడు, అర్చకుడు బల్యపెల్లి శశికాంత్ ఆధ్వర్యంలో హనుమాన్ మాలధారణ కార్యక్రమం ప్రారంభమైంది. బుధవారం 400 మంది స్వాములు మాలధారణ చేసుకున్నారు.

ఇబ్రహీంపట్నం: మండలంలోని అమ్మక్కపేట ఆంజనేయస్వామి ఆలయం వద్ద బుధవారం 150 మంది ఆంజనేయస్వామి దీక్షను తీసుకున్నారు. అర్చకులు మల్లికార్జున స్వామి మాలలు ధరింపచేశారు.

రాంపూర్ పంప్ హౌజ్ సందర్శన

మేడిపల్లి: భీమారం, మేడిపల్లి మండలాల బీఆర్‌ఎస్ నాయకులు బుధవారం రాంపూర్ పంప్ హౌస్‌ను సందర్శించారు. గాయత్రి పంప్‌హౌజ్ ద్వారా రాంపూర్ వరకు వరదకాల్వలో నీటి మట్టం పెరిగిందని, అక్కడి నుంచి మేడిపల్లి, భీమారం వరద కాల్వలోకి నీటిని విడుదల చేస్తే రైతాంగానికి సాగు, తాగు నీటికి ఇబ్బంది లేకుండా ఉంటుందని కోరారు. రెండు మండలాల్లో ఒక్క ఎకరా ఎండిన కాంగ్రెస్ పార్టీ బాధ్యత వహించాల్సి ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి మేడిపల్లి మండలాల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు క్యాతం సత్తిరెడ్డి, రవీందర్ రావు, ఉదిగిరి ఆదిరెడ్డి, ఉరుమట్ల చిన్నరాజం, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ ప్రాథమిక విద్య భవిష్యత్‌కు పునాది

మల్యాల: అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పూర్వ ప్రాథమిక విద్య చిన్నారుల భవిష్యత్‌కు బాటలు వేస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజశ్రీ అన్నారు. మండలంలోని పోతారంలో బుధవారం ఎర్లీ చైల్డ్ కేర్ ఎడ్యుకేషన్ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులను ప్రత్యేకంగా అలంకరించి, ఆటలు నిర్వహించారు. అనంతరం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజశ్రీ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పూర్వ ప్రాథమిక విద్యపై తల్లులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాటీ టీచర్లు జమున, వసజ, శ్రీలత, పిల్లలు, తల్లులు పాల్గొన్నారు.

గిరిజన మినీ గురుకుల బాలికల పాఠశాలలో స్కూల్ డే వేడుకలు



డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు

మల్లాపూర్: మండల కేంద్రంలోని గిరిజన మినీ గురుకుల బాలికల పాఠశాలలో బుధవారం స్కూల్ డే (పాఠశాల వార్షికోత్సవం) ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ లక్ష్మి ప్రియాంక మాట్లాడుతూ విద్యార్థులు గమ్యం చేరే వరకు శ్రమించాలన్నారు. చదువుతో పాటు ఆటపాటలతో రాణించాలని సూచించారు. అనంతరం విద్యార్థులు చేసిన నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో టీచర్లు సుమలత, సునీత , శ్రీలత, జ్యోతి, అరుణ పాల్గొన్నారు.

గుండెపోటుతో ప్రభుత్వ ఉపాధ్యాయుడు మృతి



చంద్రయ్య(ఫైల్)

వెల్గటూర్ : ఎండపల్లి మండలం గుల్లకోట గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు లింగంపల్లి చంద్రయ్య బుధవారం సాయంత్రం గుండెపోటుతో మృతిచెందారు. గుల్లకోటకు చెందిన చంద్రయ్య ప్రస్తుతం గొల్లపల్లి మండలం దట్నూర్ ఎంపీపీఎస్‌లో విధులు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడుగా పనిచేస్తూ స్వచ్ఛంద సంస్థ స్థాపించి ఎంతో మంది పేద విద్యార్థులకు సాయమందిస్తున్నారు. నిరుపేద విద్యార్థులకు నవోదయ, గురుకుల పాఠశాలల్లో సీట్లు సాధించేలా ఉచితంగా శిక్షణ ఇచ్చి సీట్లు పొందాలే కృషి చేశారు. తాను చదువుకున్న గుల్లకోట, ఎండపల్లి ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేశారు. గతంలో మండల స్థాయి, జిల్లా స్థాయి, రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడుగా అవార్డులు పొందారు. ఎంతో మందికి ఆదర్శంగా నిలిచిన చంద్రయ్య హఠాన్మరణం పట్ల గ్రామస్తులు, విద్యార్థులు విచారం వ్యక్తం చేశారు. వారి ఆత్మకు శాంతి కలగాలని కోరుకున్నారు.